నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
31-05-2025
పేజీలు: 02

## ఐపీఎల్‌లో రేపు



పంజాబ్ VS ముంబై
అహ్మదాబాద్,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్‌స్టార్‌లో..

## ఐపీఎల్ ప్లే ఆఫ్స్


బెంగళూరు
క్వాలీఫైయర్ 1, మే 29
న్యూ ఛండీఘర్
పంజాబ్



గుజరాత్
ఎలిమినేటర్, మే 30
న్యూ ఛండీఘర్
ముంబై

ముంబై
క్వాలీఫైయర్ 2, జూన్ 01
అహ్మదాబాద్
పంజాబ్

ఆర్సీబీ
ఫైనల్, జూన్ 03
అహ్మదాబాద్
నో రిజల్ట్






ఆరెంజ్ క్యాప్
759
ఐపీఎల్
అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్
25
ఐపీఎల్
అత్యధిక వికెట్స్



# బిన్ లాడెన్ చివరి పదేళ్ల జీవితంపై
# పూరి ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ తన 'పూరి మ్యూజింగ్స్' కార్యక్రమం ద్వారా పలు ఆసక్తికర అంశాలపై తనదైన శైలిలో విశ్లేషణలు అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన 'మోస్ట్ వాంటెడ్' పేరుతో, అల్‌ఖైదా వ్యవస్థాపకుడు, ప్రపంచాన్ని వణికించిన ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ చివరి జీవితానికి సంబంధించిన పలు ఆశ్చర్యకరమైన విషయాలను పంచుకున్నారు. వేలాది మంది అమాయకుల మరణానికి, సెప్టెంబర్ 11 దాడులకు ప్రధాన సూత్రధారి అయిన లాడెన్, తన చివరి పదేళ్లు తీవ్ర భయాందోళనలు, కష్టాల నడుమ గడిపాడని పూరి తెలిపారు. పాకిస్థాన్‌లోని స్వాత్ వ్యాలీలో పోలీసులు ఓ కారును ఆపినప్పుడు, అందులో ఉన్నది బిన్ లాడెన్ అని వారికి తెలియలేదని, ఆనాడు పట్టుబడకుండా తప్పించుకున్న లాడెన్, లేకపోతే పదేళ్ల ముందే దొరికేవాడని పూరి అన్నారు. అనంతరం స్వాత్ వ్యాలీ, పెషావర్, హరిపూర్ మీదుగా చివరకు అబోట్టాబాద్‌లోని 'వజీరిస్థాన్ హవేలీ' అనే ఇంట్లో లాడెన్ స్థిరపడ్డాడని వివరించారు. ఈ ఇంటిని అత్యంత పకడ్బందీగా, చుట్టూ 12 నుంచి 18 అడుగుల ఎత్తైన గోడలతో, మూడంతస్తుల భవనంగా నిర్మించుకున్నాడని తెలిపారు. తన ముగ్గురు భార్యలు, 8 మంది పిల్లలు, ఐదుగురు మనవళ్లతో కలిసి లాడెన్ అక్కడే నివసించాడని చెప్పారు.పూరి వెల్లడించిన వివరాల ప్రకారం, లాడెన్ ఎక్కువగా తన చిన్న భార్యతో రెండవ, మూడవ అంతస్తులలో గడిపేవాడు. ఆ ఇంటికి టెలిఫోన్ గానీ, ఇంటర్నెట్ కనెక్షన్ గానీ లేవు. చెత్తను కూడా ఇంట్లోనే కాల్చేస్తూ, బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా అత్యంత రహస్యంగా జీవించాడు. ఆ ఇంట్లో ఎవరు నివసిస్తున్నారనే విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలిసేది కాదని పూరి పేర్కొన్నారు. లాడెన్ వద్ద కేవలం నాలుగు జతల బట్టలు, ఒక జాకెట్, రెండు స్వెటర్లు మాత్రమే ఉండేవని, దాదాపు తొమ్మిదేళ్ల పాటు అక్కడే అజ్ఞాత జీవితం గడిపాడని తెలిపారు. స్పై శాటిలైట్ల కంట పడకుండా ఉండేందుకు, బయటకు వచ్చిన ప్రతిసారీ కౌబాయ్ టోపీ పెట్టుకుని కాంపౌండ్‌లో తిరిగేవాడని చెప్పారు. అతని నమ్మకస్తులైన అబు అహ్మద్ అల్ కువైటీ, అతని స్నేహితుడు అబ్రార్ మాత్రమే లాడెన్‌కు బయటి ప్రపంచంతో సంధానకర్తలుగా వ్యవహరించేవారని, ఇంటి అవసరాలు కూడా వారే చూసుకునేవారని పూరి వివరించారు.ఆ ఇంటి ఆవరణలోనే కూరగాయలు పండించుకుంటూ, కుందేళ్లు, కోళ్లను పెంచుకుంటూ లాడెన్ కాలం గడిపేవాడని పూరి తెలిపారు. తన మనవళ్లతో మొక్కలు నాటించి, ఎవరి మొక్క పెద్దగా పెరిగితే వారికి బహుమతులు ఇస్తానని పోటీలు కూడా పెట్టేవాడట. రహస్యంగా ఏర్పాటు చేసుకున్న శాటిలైట్ డిష్ ద్వారా టీవీ చూసేవాడని, తన గురించి అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా ఏం మాట్లాడుతున్నాడో ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడని అన్నారు. ఆశ్చర్యకరంగా, లాడెన్ ఎక్కువగా 'టామ్ అండ్ జెర్రీ' యానిమేటెడ్ సినిమాలు చూసేవాడని, స్వీట్లు, చాక్లెట్లు అంటే కూడా చాలా ఇష్టపడేవాడని పూరి వెల్లడించారు.ఒకసారి తన భార్య ప్రసవ సమయంలో, తప్పనిసరి పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిందని పూరి తెలిపారు. మారువేషంలో వెళ్లిన లాడెన్, తన భార్య మూగ, చెవిటిదని డాక్టర్‌కు అబద్ధం చెప్పాడని, దాంతో వైద్యులు ఆమెను ఎలాంటి ప్రశ్నలు అడగలేదని చెప్పారు. ఆ రోజు ఆసుపత్రిలో అమాయకంగా కూర్చున్న లాడెన్‌ను ఎవరూ గుర్తుపట్టలేకపోయారని అన్నారు.అల్‌ఖైదా కార్యకలాపాల గురించి లాడెన్ చెబుతుంటే, కూతుళ్లు కాగితంపై రాసేవారని పూరి వివరించారు. ఆ సమయంలో అల్‌ఖైదా బలహీనపడటం, ప్రజల్లో ఆదరణ కోల్పోవడం వంటి విషయాలపై లాడెన్ తీవ్రంగా మధనపడేవాడని, ఒక దశలో అల్‌ఖైదా పేరు మార్చాలని కూడా ఆలోచించాడని తెలిపారు. తన పిల్లలు, మనవళ్లు స్కూల్‌కు వెళ్లే అవకాశం లేకపోవడంతో, తానే వారికి పాఠాలు చెప్పేవాడని అన్నారు. ఇంట్లో ఇంటర్నెట్ కనెక్షన్ లేని కంప్యూటర్ ఉండేదని, ఏదైనా సమాచారం చేరవేయాలంటే యూఎస్‌బీ డ్రైవ్‌లను వాడేవాడని చెప్పారు .ఏళ్ల తరబడి అదే ఇంట్లో అనుక్షణం భయంతోనే లాడెన్ బతికాడని పూరి పేర్కొన్నారు.

# కిడ్నీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు
# దివ్య ఔషదం

కొంచెం తీపి మరికొంచెం వగరుగా ఉండే అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లో నిగనిగలాడుతూ నోరూరిస్తున్నాయి. వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తికాదు. అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి మేలు చేకూరుతాయని వైద్యులు కూడా చెబుతున్నారు. ఇందులో విశిష్ట గుణాలుం టాయని పేర్కొంటున్నారు. మధుమేహం, కిడ్నీ రోగులకు ఇవి దివ్యఔషదంగా పనిచేస్తాయి. అల్లనేరేడు పండ్ల చెట్లు గతంలో ఎటుచూసినా ఇళ్ల ఆవరణలో కనపడేవి. కానీ కాలక్రమేనా అవి ఇళ్లలో కాకుండా ఎక్కువ శాతం అడవి ప్రాంతంలోనే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో హైబ్రిడ్ రకం పండ్లు జోరుగా రావడంతో డిమాండ్ బాగా పెరిగింది. సాధారణ రకం నేరేడుపండ్లు మార్కెట్లో కిలో రూ.100 పలుకగా, హైబ్రిడ్ రకం పండ్లయితే రూ.150 వరకు ఉంటుంది. ప్రతి ఏడాది మే, జూన్ మాసాల్లోనే వచ్చే ఈ నేరేడు పండ్ల కోసం గ్రామాలలోని కొంత మంది రోజు కూలీలు ఉదయమే అడవిబాట పట్టి మధ్యాహ్నం వరకు గంపలలో తీసుకొచ్చి మార్కెట్లో విక్రయిస్తుంటారు.



# పీసీసీ చీఫ్‌పై
# హరీశ్‌రావు ఫైర్

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌తో రహస్యంగా సమావేశమయ్యారన్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. పీసీసీ అధ్యక్ష హోదాలో ఉండి చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సూటిగా ఎదుర్కొనే ధైర్యంలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. విలువలు విస్మరించి రేవంత్ రెడ్డి బాటలోనే నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బట్ట కాల్చి మీద వేసినంత మాత్రానా అబద్దాలు, నిజం అయిపోవన్నారు. ఇలాంటి ఆరోపణలు మానుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై దృష్టిపెట్టాలని చురకలంటించారు. 'పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉండి మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న చిల్లర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సూటిగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. విలువలకు తిలోదకాలు ఇచ్చి, రేవంత్ రెడ్డి బాటలోనే మీరూ నడుస్తున్నారు. బట్ట కాల్చి మీద వేసినంత మాత్రానా అబద్దాలు, నిజం అయిపోవు. పెళ్ళిలోనో, చావు లోనో కలిసిన సందర్భాలే తప్ప మీరు ఆరోపించినట్లు ఇతర పార్టీ నాయకులను గానీ, మా పార్టీ నుంచి వెళ్లిన నాయకులను గాని ఎప్పుడూ వ్యక్తిగతంగా కలిసింది లేదు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తాను తప్ప, మీ లాగా చిల్లర రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూడను. ఇలాంటి ఆరోపణలు మానుకొని, స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు పై దృష్టి పెట్టాలని మహేష్ కుమార్ గౌడ్‌కు సూచిస్తున్నాం.' అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.




# రెండు వేలు దాటిన కరోనా పాజిటివ్ కేసులు



ఇన్ని రోజులూ శాంతించిన కరోనా వైరస్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. భారత్‌లోనూ కరోనా వైరస్ వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం భారత్‌లో కొవిడ్ వైరస్ కేసుల సంఖ్య రెండు వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. గడిచిన 24 గంటల్లో సుమారు వెయ్యి మందికి పాజిటివ్‌గా తేలింది. నిన్న 1,828 యాక్టివ్ కేసులు ఉండగా.. తాజా కేసులతో కలిపి ఆ సంఖ్య 2,710కి పెరిగింది. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 1,147 కేసులు నమోదైనట్లు తెలిపింది. ఆ తర్వాత మహారాష్ట్రలో 424 కేసులు, ఢిల్లీలో 294, గుజరాత్‌లో 223, కర్ణాటకలో 148, తమిళనాడులో 148, పశ్చిమ బెంగాల్‌లో 116 కేసులు నమోదైనట్లు వివరించింది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 16, తెలంగాణలో 3 పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. కాగా, మే 25తో ముగిసిన వారంలో ఇన్ఫెక్షన్లు ఐదు రెట్లు పెరిగి 1,000 మార్క్‌ను దాటినట్లు వెల్లడించింది. మరోవైపు వైరస్ వ్యాప్తితోపాటు మరణాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. గత 24 గంటల వ్యవధిలో ఏడు మరణాలు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించగా, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మరణాలు నమోదయ్యాయి.

# మరో షాకిచ్చిన డొనాల్డ్ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన ప్రకటన చేశారు. పెన్సిల్వేనియాలో జరిగిన ఓ ర్యాలీలో స్టీల్‌పై ప్రస్తుతం ఉన్న 25% సుంకాన్ని త్వరలోనే 50%కి పెంచనున్నట్లు తెలిపారు. ఇది తాత్కాలికం కాదని, వచ్చే వారం నుంచే అమల్లోకి రానుందని స్పష్టం చేశారు. ట్రంప్ చేసిన ప్రకటన జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్, అమెరికన్ యుఎస్ స్టీల్ మధ్య జరిగిన భాగస్వామ్య ఒప్పందాన్ని ఆయన ప్రమోట్ చేస్తుండగా జరిగింది. ఈ రెండు కంపెనీలు కలిసి అమెరికాలో 70,000 ఉద్యోగాలను కల్పించేందుకు, అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి 14 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పుడు ఇన్వెస్ట్ చేసిన ఈ గ్రూప్ చాలా హ్యాపీగా ఉందన్నారు. ఎందుకంటే ఇప్పుడు ఎవరూ మీ పరిశ్రమను దోచుకోలేరని ట్రంప్ అన్నారు. 25% సుంకం ఉన్నప్పుడు కొంతవరకు ఆ అడ్డంకిని దాటి వచ్చేవారు. కానీ ఇప్పుడు 50% అయితే, ఎవ్వరూ దాటలేరని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనతో ప్రపంచ వ్యాప్తంగా స్టీల్ మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా చైనాకు ఇది పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక స్టీల్ ఉత్పత్తి, ఎగుమతులు చేసే దేశం చైనానే. 2018లో అమెరికా 25% టారిఫ్ విధించినప్పటి నుంచి చైనా నుంచి అమెరికాకు స్టీల్ ఎగుమతులు క్రమంగా తగ్గాయి.





# అందాలు దాచుకోని
# భూమి

టాయిలెట్ సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ముద్దుగుమ్మ భూమి పెడ్నేకర్. తన తొలి చిత్రం 'దమ్ లగాగే హైసా'తోనే నటిగా తానేంటో నిరూపించుకుంది.'లస్ట్ స్టోరీస్' బ్యూటీ భూమి పెడ్నేకర్ పెర్ఫామెన్స్‌లోనే కాదు.. అందాలను ఆరబోయ డంలోనూ ముందుంటుంది. బోల్డ్ సీన్స్‌లో యాక్ట్ చేయడానికి ఏమాత్రం వెనుకాడదు. అంతే కాదండోయ్.. సోషల్ మీడియాలోనూ గ్లామర్ ఒలకబోస్తూ యూత్ టెంపరేచ్‌ను పెంచేస్తుందనడంలో సందేహం లేదు. రీసెంట్‌గా చక్కటి చీరకట్టులో ఉన్న ఆమె అందాల ప్రదర్శన కుర్రకారుకి నిద్ర లేకుండా చేసిందనేలా కొన్ని ఫొటోలు నెట్టింట తెగ హల్ చల్ చేస్తున్నాయి.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# కళ్లు చెదిరే యార్కర్ వేసిన బుమ్రా

దెబ్బకు నేలమీద పడ్డ వాషింగ్టన్ సుందర్ ఐపీఎల్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్ లైవ్ చూస్తున్న వాళ్లకి నిన్న రాత్రి మజానే మజా. గుజరాత్ టైటాన్స్ - ముంబై ఇండియన్స్ మ్యాచ్ ఐపీఎల్ ఫ్యాన్స్‌కి ఫుల్ ఫీస్ట్ ఇచ్చింది. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా యార్కర్ బౌల్డ్‌ని లైవ్‌లో చూసిన ఫ్యాన్స్‌కి ఫ్యూజులు ఎగిరిపోయాయి. రెండు కాళ్ల మధ్య నుంచి వికెట్లను తగలడం అంటే.. అందుకేనేమో బుమ్రాని వరల్డ్ టాప్ బౌలర్ అని పిలిచేది.ఇంటర్నేషనల్, డొమెస్టిక్, ఐపీఎల్ ఏ ప్లాట్‌ఫామ్ అయినా జట్టు కష్టాల్లో ఉందంటే కెప్టెన్‌కి ముందుగా గుర్తొచ్చే అస్త్రం బుమ్రా. బుమ్రా బౌలింగ్ వేశాడంటే వికెట్ విరిగి పడాల్సిందే. టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియాను గెలిపించిన బుమ్రా నిన్న రాత్రి గుజరాత్ టైటాన్స్‌పై ముంబైకి విజయాన్ని అందించాడు. మ్యాచ్ చేజారిపోతుంది అనుకున్న సమయంలో బంతిని తీసుకుని ముంబై ఫ్యాన్స్‌లో జోష్‌ని నింపాడు. గుజరాత్ టైటాన్స్ - ముంబై ఇండియన్స్ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 14వ ఓవర్‌లో బుమ్రా వేసిన యార్కర్‌కి క్రికెట్ ఫ్యాన్స్ మైండ్ బ్లాంక్ అయింది. అసలు అలాంటి పీక్ టైమ్‌లో సుందర్‌ని అవుట్ చేసిన తీరుకి స్టేడియం మొత్తం దద్దరిల్లింది. బుమ్రా యార్కర్‌ని అడ్డుకోవడానికి సుందర్ శతవిధాలా ప్రయత్నించినప్పటికీ.. అది రెండు కాళ్ల మధ్య నుంచి వెళ్లి వికెట్‌కు తగిలింది. ఆ యార్కర్‌కి సుందర్ నేలమీద పడిపోయాడు. దాంతో గుజరాత్ ఓటమి ఖరారైంది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు జానీ బెయిర్ స్టో, రోహిత్ శర్మ బౌండరీల వర్షం కురిపించారు. బెయిర్ స్టో 22 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 47 పరుగులు చేయగా, రోహిత్ శర్మ 50 బంతుల్లో 9 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 81 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆఖర్లో హార్దిక్ సిక్సర్ల మోత మోగించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే కెప్టెన్ గిల్ వికెట్ కోల్పోయింది. సాయి సుదర్శన్ ఒంటరి పోరాటం చేయగా.. కుశాల్ మెండిస్, వాషింగ్టన్ సుందర్ కాసేపు మెరుపులు మెరిపించారు. ఆఖర్లో బుమ్రా మ్యాజిక్ బౌలింగ్‌తో గుజరాత్ ఓటమి తప్పలేదు. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయిన గుజరాత్ 208 పరుగులు చేయడంతో ముంబై 20 పరుగల తేడాతో విజయం సాధించింది.







## పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం..

### ఐదుగురు మృతి, ఆరుగురికి గాయాలు

పలువురు పెళ్లి వేడుకకు హాజరై కారులో తిరిగి వస్తున్న క్రమంలో అనుకోకుండా అది బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఓ చిన్నారి సహా ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతోపాటు మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ విషాద ఘటన ఉత్తర్ ప్రదేశ్ హర్దోయ్ జిల్లా మజ్హిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని భూప్ప పూర్వా మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పటియానీం గ్రామంలో నిర్వహించిన నీరజ్ వివాహ వేడుక ముగించుకుని, పలీ గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. అందరూ ఒకే కారులో ప్రయాణిస్తున్న సమయంలో అతి వేగంగా వెళ్తున్న వాహనం నియంత్రణ కోల్పోయి అలమ్నగర్ రోడ్డుపై మలుపు వద్ద డిచ్‌లోకి పడిపోయింది. ఇది చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. మిగతా ఆరుగురిని ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. శహాబాద్ సర్కిల్ ఆఫీసర్ అనుజ్ మిశ్రా మృతుల వివరాలను వెల్లడించారు. వారిలో జితేంద్ర (22), ఆకాష్ (18), సిద్ధార్థ్ (6), రాము (35), జౌహరి (40) ఉన్నారు. ఈ ఐదుగురు హర్దోయిలోని పలీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నవారే. గాయపడినవారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని హర్దోయి జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. ఈ ప్రమాదం వారి కుటుంబాల్లోనే కాదు, వారి గ్రామాల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.


## కోహ్లీని దాటేసిన రోహిత్

భారత క్రికెట్ అభిమానులకు "హిట్‌మ్యాన్"గా సుపరిచితుడైన రోహిత్ శర్మ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మే 30, 2025న ముల్లాన్‌పూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన హోరాహోరీ ఎలిమినేటర్ మ్యాచ్‌లో, రోహిత్ శర్మ ఐపీఎల్ చరిత్రలో 300 సిక్సర్లు బాదిన తొలి భారతీయ క్రికెటర్‌గా, ఓవరాల్‌గా రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ మైలురాయిని చేరుకోవడంతో పాటు, అదే మ్యాచ్‌లో 7000 ఐపీఎల్ పరుగులు పూర్తి చేసుకుని డబుల్ ధమాకా అందించాడు. ముంబై ఇండియన్స్‌కు కీలకమైన ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై తనదైన శైలిలో విరుచుకుపడిన రోహిత్, 50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా రషీద్ ఖాన్ వేసిన 9వ ఓవర్ నాలుగో బంతిని సిక్సర్‌గా తరలించి, ఐపీఎల్‌లో 300 సిక్సర్ల క్లబ్‌లో చేరాడు. అంతకుముందు క్రిస్ గేల్ (357 సిక్సర్లు) మాత్రమే ఈ ఘనతను అందుకున్నాడు.




## నరివెట్ట రివ్యూ

మలయాళ హీరో టొవినో థామస్ నటించిన 'నరివెట్ట' చిత్రం తెలుగు డబ్బింగ్ నేడు(మే 30) థియేటర్లలో రిలీజ్ అయ్యింది. మలయాళంలో మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందో ఈ రివ్యూలో చూద్దాం. మంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రయత్నించే వర్గీస్(టొవినో థామస్) తన తల్లి, తాను ప్రేమించిన అమ్మాయి కోసం పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో జాయిన్ అవుతాడు. అయితే, అతనికి ఇష్టం లేకుండానే ఆ జాబ్ చేస్తుంటాడు. కాగా, వయనాడ్ ప్రాంతంలో గిరిజనులు అడవుల్లో గుడిసెలు వేసుకుని భూమిని కబ్జా చేశారని.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు పోలీస్ బెటాలియన్ రంగంలోకి దిగుతుంది. ఆ తర్వాత పోలీసులకు, ఆదివాసీలకు మధ్య ఎలాంటి యుద్ధం జరిగింది..? పోలీసులను ఆదివాసీలు ఏమైనా చేశారా..? టొవినో థామస్‌కు అక్కడ ఎలాంటి నిజాలు తెలుస్తాయి..? చివరకు ఏం జరుగుతుంది..? అనేది సినిమా కథ. మలయాళ చిత్రాలంటే తెలుగు ప్రేక్షకులకు ఎందుకు ఇష్టమో ఈ సినిమా చూస్తే మరోసారి స్పష్టమవుతుంది. మంచి కథ, దానికి తగ్గ పర్ఫార్మెన్స్ కలగలిసి ఈ సినిమాను ప్రేక్షకులకు నచ్చేలా చేశాయి. పోలీస్ థ్రిల్లర్ మూవీలో ఉండాల్సిన అన్ని అంశాలను ఈ సినిమాలో మనం చూడవచ్చు. ఇక ప్రేక్షకులకు ఎక్కడా బోర్ కొట్టకుండా ఉండేలా దర్శకుడు చేసిన ప్రయత్నం మెచ్చుకోవాల్సిందే. ఈ ప్రయత్నం కొంత ఫెయిల్ అయినా, అతని జెన్యూన్ అటెంప్ట్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తుంది. వాస్తవికతకు దగ్గరగా జరిగిన ఈ కథను ప్రేక్షకులు ఫీల్ అవుతారు. అడవుల్లో నివసించే ఆదివాసీలకు ఆ అడవుల్లో రక్షణ లేకుండా పోవడం అనే పాయింట్ సామాన్య ప్రేక్షకుడికి నచ్చుతుంది. ఇక పోలీసులు వారి పట్ల ఎలా ప్రవర్తించారు.. వారిలో ఎలాంటి గొడవలు చోటు చేసుకుంటాయి.. చివరికి వారిలో ఒకరు ఎలా తిరగబడ్డాడు అనేది చాలా చక్కగా ప్రెజంట్ చేశారు. ఈ పోలీస్ థ్రిల్లర్ చిత్రంలో కూడా మైనస్ పాయింట్స్ ఉన్నాయి. ఈ సినిమాలోని లవ్ ట్రాక్ ఈ చిత్రానికి పెద్ద డ్యామేజ్ చేసిందని చెప్పాలి. కథను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ట్రాక్ కొంతవరకు ఉపయోగపడినా, అది పూర్తిగా డెవలెప్ చేయలేదనిపిస్తుంది. దీంతో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే ట్రాక్ ప్రేక్షకులను మెప్పించదు. ఇక రిపీటెడ్‌గా ఫ్లాష్ బ్యాక్ సీన్స్‌కు తీసుకెళ్లేందుకు దర్శకుడు ఎంచుకున్న విధానం కూడా కొంతవరకు మెప్పించదు. అటు ఆదివాసీల్లో కూడా కొందరు స్టార్ క్యాస్టింగ్‌ను తీసుకుని ఉండాల్సింది. సెకండాఫ్‌లో కథ చాలా నెమ్మదించినట్లుగా కనిపిస్తుంది. స్క్రీన్ ప్లే విషయంలోనూ చిత్ర యూనిట్ ఇంకాస్త జాగ్రత్తగా ఉండాల్సింది.




## నైజీరియాను ముంచెత్తిన వరదలు.. 111 మంది మృతి



ఆఫ్రికా దేశం నైజీరియాను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. ఈ వర్షాలకు ఓ డ్యామ్ కూలిపోయింది. ఈ వరదలకు 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాలకు సెంట్రల్ నైజీరియాలోని మోక్వా పట్టణానికి సమీపంలోని ఓ డ్యామ్ కూలిపోయింది. దీంతో వరద ఆ పట్టణాన్ని ముంచెత్తింది. ఈ ఘటనలో 111 మంది ప్రాణాలు కోల్పోయారు. రంగంలోకి దిగిన అధికారులు మోక్వా పట్టణంలో సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నైజీరియాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వరదలకు అనేక ఇళ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రహదారులు దెబ్బతిన్నాయి.



## రాయల్ లుక్స్‌లో రామ్ చరణ్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న అవైటెడ్ చిత్రమే "పెద్ది". పాన్ ఇండియా లెవెల్లో సాలిడ్ రెస్పాన్స్ ని అందుకున్న ఈ చిత్రం కోసం రామ్ చరణ్ సరికొత్త మేకోవర్ సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. మరి ఈ లుక్స్ లోనే తాను మాస్ గా కనిపిస్తున్నాడు అలాగే క్లాస్ లుక్ లో కూడా దర్శనమిస్తున్నాడు. మరి ఇలా లేటెస్ట్ గా తన నుంచి మంచి రాయల్ లుక్స్ బయటకి వచ్చాయి. ఆ మధ్య విదేశీ పర్యటన చేసిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సూట్ లో స్టన్నింగ్ లుక్స్ లో అదరగొట్టాడు. మరి లేటెస్ట్ గా తన ఫోటోగ్రాఫర్ ఆరిఫ్ మినాహ్ షేర్ చేసిన పిక్స్ కొన్ని వైరల్ గా మారాయి. దీనితో ఈ పిక్స్ చూసిన ఫ్యాన్స్ మంచి ఎగ్జైట్ అవుతున్నారు. అలాగే ఈ లుక్స్ లో ఒక సాలిడ్ యాక్షన్ డ్రామా సందీప్ రెడ్డి వంగ లాంటి దర్శకునితో పడితే భలే ఉంటుంది అని అనుకుంటున్నారు.



## ఊరించేస్తున్న పాలక్ తివారీ

లేలేత అందాలతో పరువాలన్నీ ప్రదర్శిస్తూ కుర్రకారును చిత్తుచేస్తుంది బాలీవుడ్ బ్యూటీ పాలక్ తివారీ. ఇటీవల గ్లామర్ డోస్ రెట్టింపు చేసి రచ్చ చేస్తుంది. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తన ఫోటో షూట్ పిక్స్ షేర్ చేస్తూ నెటిజన్లను ఫిదా చేస్తుంది.ఆమె నటించిన హారర్ సినిమా భూత్నీ ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో పాలక్ ఆ సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటుంది. ప్రమోషన్స్ లో భాగంగా ప్రీతి వేసుకుంటున్న కాస్ట్యూమ్స్ అందరినీ ఎట్రాక్ట్ చేస్తున్నాయి. తాజాగా అమ్మడు రెడ్ కలర్ ఫ్రాకులో కనిపించి అందరినీ ఎట్రాక్ట్ చేసింది. ఈ డ్రెస్ కు షోల్డర్ దగ్గర గులాబీలను యాడ్ చేయడంతో అమ్మడి అందం మరింత పెరిగింది. పాలక్ తివారీ షేర్ చేసిన ఈ ఫోటోలకు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు.